# ప్రధాన కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లు పెట్టాలి

- సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో



కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ: పట్టణంలోని లారీ చౌరస్తాలో రాస్తా రోకో చేస్తున్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, డిసెంబర్16: కాగజ్‌నగర్ పట్టణంలో ప్రధాన కూడళ్లు వద్ద స్పీడ్ బ్రేకర్లు పెట్టాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో ప్రధాన కూడళ్లు అయిన రాజీవ్ గాంధీ చౌరస్తా, లారీ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తాలలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు, కాం ట్రాక్టర్లకు రోడ్డు వేయడంలో ఉన్న శ్రద్ధ స్పీడ్ బ్రేకర్లు నిర్మించడంలో లేకపావడం విచారకరమన్నారు. వెంటనే చౌరస్తాలలో స్పీడ్ బ్రేకర్లతో పాటు సిగ్నల్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్, సాయికృష్ణ, సీఐటీయూ నాయకులు సంజీవ్, శంకర్, కేవీపీఎస్ నాయకులు రవి కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భీమేశ్, నాయకులు నితీశ్ తదితరులు పాల్గొన్నారు.

## సీజీనల్ వ్యాధులపై అవగాహన



తిర్యాణి: పంగిడిమాధర ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్

తిర్యాణి, డిసెంబర్16: మండలంలోని పంగిడిమాధర బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై శనివారం అవగాహన కల్పించినట్లు ఆరోగ్య విస్తరణాధికారి నైతం శ్రీనివాస్ తెలిపారు. టీబీ, కుష్టు,అంటువ్యాధులు,దోమల ని వారణ,ఆరోగ్యం,విద్య వంటి పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించినట్లు తెలిపారు. చలికాలంలో దగ్గు, జలుబు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా అస్తమా ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించినట్లు తెలిపారు.అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని పాఠశాల ఏఎన్ఎం కు సూచించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే వెంటనే దవాఖానకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య,హెచ్ఎం గోపాల్,ఉపాధ్యాయులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నట్లు తెలిపారు.

## అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర



కాగజ్‌నగర్‌లో అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, డిసెంబర్16 : కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం శ్రీరామ జన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్ట్-అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన పూజిత అక్షింతలకు భక్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి శోభాయత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పరమ పవిత్రమైన అక్షింతలకు భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలుకుతూ శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్ర కాగజ్‌నగర్ పట్టణంలోని బాలజీనగర్ కాలనీ శ్రీ త్రినేత్ర శివాలయం నుంచి పట్టణ పురవీధుల మీదుగా బాల భారతి హనుమాన్ మందిర్ వరకు కొనసాగింది, శోభాయాత్రకు మహిళలు మంగళహారతులతో, మేళ తాళాలతో, యువకులు నృత్యాలతో, జై శ్రీరామ్ నామ స్మరణతో పట్టణ వీధులన్ని మార్మోగాయి, మెయిన్ మార్కెట్‌లో వ్యాపారస్తులు పల్లకీపై పుష్పాలు చల్లి, హారతులు ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హనుమాన్ ఆలయం చేరుకున్న పూజిత అక్షింతలకు ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. అనంతరం శోభాయత్రలో పాల్గొన్న భక్తులకు పులిహోర, బూంది ప్రసాదం పంచి పెట్టారు. ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొని విజయవంతం చేసినందుకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

# పల్లెలెరుగని 'పల్లె వెలుగు'

- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- దహెగాంకు బస్సు నడపాలని వేడుకోలు

దహెగాం, డిసెంబర్16: కొత్త ప్రభుత్వం మహిళల కోసం మహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్టీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేసింది. అదే క్రమంలో మారు మూల గ్రామాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని పలువురు గ్రామసులు వేడుకుంటున్నారు. కాగజ్‌నగర్ నుంచి దహెగాంకు ఆర్టీ బస్సు సౌకర్యం లేదు. గతంలో కొన్ని రోజులు బస్సు నడిపిన అధికారులు ఏమైందో కానీ బస్సును నడపడం నిలిపివేశారు.కేబీ ఆసిఫాబాద్ డిపో నుంచి కాగజ్‌నగర్ నుంచి బస్సును నడపడం వల్ల మం డలంలోని ఇట్యాల, బోర్లకుంట, కోత్మీర్, బీబ్రా, ఐనం, దహెగాం, కమ్మర్‌పల్లి,లగ్గాం, ఓడుగూడ, చిన్నరాస్పల్లి, గెర్రె, గిరివెల్లి, ఖర్జీ రాంపూర్, మొట్లగూడ గ్రామపంచా యతీల వరకు కాగజ్‌నగర్ నుంచి 60 కిలో మీటర్ల దూరంలో ఉన్న మొట్లగూడ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. సదరు గ్రామాలనుంచి రోజు వందలాది మంది ప్రయాణికులు కాగజ్న గర్‌తో పాటు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగి స్తుంటారు. ఇప్పటికైనా ప్రభుత్వం మారుమూల గ్రామాలకు ఆర్టీ బస్సు సౌకర్యం కల్పించాలని మండల వాసులు కోరుతున్నారు.



గతంలో దహెగాంకు వచ్చిన ఆసిఫాబాద్ డిపో బస్సు (ఫైల్)

### బస్సు నడపాలి



కాగజ్‌నగర్ నుంచి దహెగాం మండలానికి బస్సు నడుపాలి.సర్కారు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నరు కానీ బస్సులు మాత్రం నడుపుతలేరు. సర్కారు మాకు మంచి సౌకర్యమే చేసింది కాని బస్సులే లేవు. ఇప్పుడు దహెగాం వరకు రోడ్డు సౌలతి కూడా మంచిగానే ఉంది. బస్సు నడుపడానికి అధికారులకు ఏమి ఇబ్బంది. వెంటనే బస్సు నడపాలి.

-పద్మ కూరగయల వ్యాపారి

### కాలేజికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది అవుతుంది



రోజు నేను కాలేజీకి ఆటోలో వెళ్లి వస్తున్నాను. దహెగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నాను.ప్రతి రోజు ఉదయాన్నే ఆటోకు వస్తున్నాను.ప్రతి రోజు 60 రూపాయలు ఖర్చు వస్తుంది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం మహలక్ష్మి పథకం పెట్టింది మహిళలు, బాలికలకు ఉచిత ప్రయాణం అందికాని కాగజ్‌నగర్ నుంచి దహెగాం బస్సు నడుపుతే మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- అంజలి,బీపీసీ విద్యార్థిని, బీబ్రా

### బస్సునడిపే ఏర్పాటు చేస్తాం

దహెగాంకు కూడా బస్సు నడిపే ఏర్పాటు చేస్తాం.ఇంతకు ముందు కొన్ని రోజు నడిపాం.సరైన టార్గెట్ రాలేదు. అందవెల్లి వద్ద పెద్దవాగుపై వంతెన కూలిపోయింది. వంతెన పనులు పూర్తి అయిన తర్వాత నడుపుతాం.ప్రభుత్వం మహలక్ష్మి పథకం కోసం మహిళల ప్రయాణం కోసం ప్రతి మారు మూల గ్రామాలకు కూడా బస్సులు నడుపడానికి చర్యలు తీసుకుంటాం

- శ్రీధర్ డీఎం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో



దహగాం : రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్

## తనిఖీ బృందాలకు సహకరించాలి

దహగాం, డిసెంబర్16: త్వరలో చేపట్టనున్న సమాజిక తనిఖీ బృందాలకు సహకరించాలని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2022-2023 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఈజీఎస్ పనులపై సమాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పనులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. తనిఖీ బృందాలకు అవసరమున్న రికార్డులను వారికి అందించాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కల్పన, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ మండల కమిటీ ఎన్నిక వాయిదా

బెజ్జూర్, డిసెంబర్ 16 :18న నిర్వహించాల్సిన ఆదివాసీ మం డల కమిటీ ఎన్నిక వాయిదా వేసినట్లు ఆదివాసీ నాయకులు మెస్రం రాజారాం, ఎలాది నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కమిటీ ఆదేశాలతో ప్రస్తుతం ఈ కమిటీ ఎన్నికను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముందుగా గ్రామ కమిటీలు నిర్వహించిన అనంతరం మండల కమిటీ ఎన్నిక నిర్వహణ తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు వారు పేర్కొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



గోలేటి ఏరియా స్టోర్స్ లో మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్

రెబ్బెన, డిసెంబర్ 16: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీఎన్‌టీయుసీ యూనియన్ ను గెలిపిస్తే కార్మికులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని టీఎన్‌టీయుసీ ప్రధాన కార్యదర్శి మణిరాం సింగ్ పెర్కొన్నారు. ఏరియా లోని గోలేటి వర్క్‌షాప్, సివిల్ డిపార్టుమెంట్‌లలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు బొల్లు మల్లయ్య, గుర్రం గంగయ్య, యాదగిరి, బాలయ్య, హసన్, సుభాన్, శంకరయ్య, థాయిర్‌ఖాన్ పలువురు ఉన్నారు.

- **హెచ్ఎంఎస్‌తో సమస్యలు పరిష్కారం**

రెబ్బెన, డిసెంబర్ 16:సింగరేణి సంస్థ లో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడే యూనియన్ హెచ్ఎంఎస్ యూనియన్ అని బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల యూనియన్ ఉపాధ్యక్షులు పత్తెం రాజబాబు, పర్వతి రాజిరెడ్డి, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఓజీయార్ లు స్పష్టం చేసారు. ఏరియా లోని గోలేటి సీహెచ్‌పీ లో శనివారం హెచ్ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హజరైన వారు మాట్లాడుతు ఈ నేల 27వ తేదిన జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ యూనియన్ ను గెలిపిస్తే కార్మికుల అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని, కార్మికుల స్వంత ఇంటి పథకం అమలు, ఇన్‌కాం టాక్స్ రీయంబర్స్‌మెంట్ అమలు చేస్తామని అన్నారు. టెక్నికల్ స్టాప్ సమస్యలు, ఆపరేటర్‌ల సమస్యలు, అసుపత్రి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఎస్అండ్‌పీసీ పిట్ సెక్రటరి ఎం. శ్రీనివాస్, అసుపత్రి ఇంచార్జి ఆర్.శ్రీనివాస్, సీహెచ్‌పీ అసిస్టెంట్ పిట్ సెక్రటరి ఉమామహేశ్వర్, ఏరియా ఆర్గనైజర్ దత్తు, ఏరియా టెక్నికల్ ఆర్గనైజర్ మంతెన వేణుగోపాల్, శాంతిఖని పిట్ సెక్రటరి కార్తీక్, ఆర్గనైజర్స్ ముద్దసాని వెంకటేశ్, సుంకరి ఓంకార్, దశరథం, భిక్షపతి, బాలేశ్ లతో పాటు పలువురు ఉన్నారు.

## 18న కబడ్డీ ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్, డిసెంబర్ 16 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో జిల్లా బాల, బాలికల అండర్-14, 17 కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి రాంచందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా నుంచి ఎంపికైన కబడ్డీ జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు ఆయా పాఠశాలల యాజమాన్యాల నుంచి జట్ల వారీగా ధ్రువీకరించిన పత్రాలతో 18న ఉదయం 9 గంటల్లోగా ప్రగతి స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.